సాక్షి
బాపట్ల
ఆదివారం । 23 । ఏప్రిల్ । 2023



అన్నదానానికి రూ.లక్ష వితరణ

నరసరావుపేటరూరల్: త్రికోటేశ్వరస్వామి దేవస్థానంలో అన్నదానానికి గుంటూరుకు చెందిన చాపలమాడుగు కవిత తన భర్త వెంకటరావు పేరుపై లక్ష నగదు అందజేశారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4500, గరిష్ట ధర రూ.5600, మోడల్ ధర రూ.5000 వరకు పలికింది.

నాలుగు కరోనా కేసులు

గుంటూరుమెడికల్: జిల్లా వ్యాప్తంగా శనివారం నాలుగు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. లాం, లేమల్లెపాడు, వెంగళాయపాలెం, గుంటూరు అరండల్‌పేటలో ఒక్కొక్కటి చొప్పున కరోనా కేసులొచ్చాయి. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

ఏడుగురు ఎస్‌ఐలు బదిలీ

బాపట్లటౌన్: జిల్లాలో ఏడుగురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. బాపట్ల డీసీఆర్‌బీలో ఉన్న జి.వి.చౌదరిని కొరిశపాడుకు, డీసీఆర్‌బీలో ఉన్న పి.నాగశివారెడ్డిని మేదరమెట్లకు, చినగంజాం ఎస్‌ఐగా ఉన్న కె.అనూక్‌ను యద్దనపూడికి, యద్దనపూడి ఎస్‌ఐగా ఉన్న డి.రత్నకుమారిని వీఆర్‌కు, కారంచేడు ఎస్‌ఐగా ఉన్న ఎం.అనితను వీఆర్‌కు, డీఎస్‌బీలో ఉన్న జి.శ్రీనివాస రావును కారంచేడుకు, వీఆర్‌లో ఉన్న కె.సురేష్‌ను చినగంజాంకు బదిలీచేస్తూ జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు.

ఉత్తమ పంచాయతీగా నడింపాలెం

'హెల్దీ పంచాయతీ' థీమ్ కేటగిరీలో ఎంపిక



నడింపాలెం (ప్రత్తిపాడు): రాష్ట్రస్థాయిలో బెస్ట్ పంచాయతీగా 'నడింపాలెం' గ్రామ పంచాయతీ ఎంపికైంది. పంచాయతీల్లో పోటీతత్వం తీసుకురావడంతో పాటు పంచాయతీలను ప్రమోట్ చేసేందుకు ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ రకాల థీమ్‌లను ప్రవేశపెట్టి ఉత్తమ పంచాయతీలను ఎంపిక చేసింది. పావర్టీ ఫ్రీ అండ్ ఎన్‌హాన్స్‌డ్ లైవ్‌హుడ్ పంచాయతీ, హెల్దీ పంచాయతీ, చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయతీ, వాటర్ సఫిషియంట్ పంచాయతీ, క్లీన్ అండ్ గ్రీన్ పంచాయతీ, సెల్ఫ్ సఫిషియంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పంచాయతీ, సోషల్లీ సెక్యూర్డ్ పంచాయతీ, పంచాయతీ విత్ గుడ్ గవర్నెన్స్, ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ.. ఇలా తొమ్మిది థీమ్స్‌లో అన్ని జిల్లాల నుంచి బెస్ట్ పంచాయతీలను (ఒక్కో థీమ్ నుంచి మూడు పంచాయతీలు) ఎంపిక చేసింది. అందులో భాగంగా ప్రత్తిపాడు మండలం 'నడింపాలెం' పంచాయతీని 'హెల్దీ పంచాయతీ థీమ్' నుంచి బెస్ట్‌గా ఎంపిక చేశారు. మొత్తం పదిహేను అంశాలను ప్రామాణికంగా తీసుకుని ఎంపికచేసినట్లు గ్రామ పంచాయతీ అధికారులు తెలిపారు.

విజయకీలాద్రిపై తిరుమంజన సేవ



తాడేపల్లిరూరల్: సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై శనివారం రామానుజుల వారికి తిరుమంజనసేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు తెలియజేశారు. భగవత్ రామానుజుల వారి తిరునక్షత్ర ఉత్సవాల్లో భాగంగా త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళశాసనాలతో ఉదయం తిరుమంజన సేవ, అలంకరణ, తదుపరి గులాబీ పుష్పాలతో సహస్రనామార్చన, అనంతరం తీర్థప్రసాద గోష్టి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రామానుజుల వారి అనుగ్రహాన్ని పొందినట్లు తెలిపారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 523.50 అడుగుల వద్ద ఉంది. ఇది 155.7360 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 5,088, ఎస్‌ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్ జలాశయం నుంచి మొత్తం ఔట్‌ఫ్లోగా 6,888 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 2,897 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 804.40 అడుగుల వద్ద ఉంది.

ప్రేమాభిమానాలు పంచేదే రంజాన్

- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున
- భట్టిప్రోలులో ఇమామ్, మౌజన్‌లకు నూతన వస్త్రాలను అందజేసిన మంత్రి

భట్టిప్రోలు: హిందూ ముస్లింలు సోదర భావంతో మెలగడం భారత సంస్కృతికి అద్దం పడుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. రంజాన్ సందర్భంగా భట్టిప్రోలులోని షాదీఖానాలో కో-ఆప్షన్ సభ్యుడు షేక్ సలీమ్ ఆధ్వర్యంలో మంత్రి నాగార్జునకు తేనేటి విందు ఏర్పాటు చేశారు. మంత్రి నాగార్జున మాట్లాడుతూ పేద, ధనిక తారతమ్యం లేకుండా అందరూ సామూహిక ప్రార్థనలు చేయడమే రంజాన్ ప్రత్యేకత అన్నారు. ముస్లిం, మైనార్టీలు పవిత్ర రంజాన్ మాసం నెల రోజులు ఉపవాసాలు ముగించి రంజాన్ పండుగను జరుపుకోవడం ఆనంద దాయకమన్నారు. మండలంలోని 7 మసీదులలోని ఇమామ్, మౌజన్‌లకు సలీమ్ మంత్రి నాగార్జున చేతుల మీదుగా నూతన వస్త్రాలను అందచేశారు. ముస్లిం సోదరులు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురాగా త్వరలోనే షాదీఖానా పనులకు రూ. 15 లక్షల నిధులు కేటాయిస్తానని ప్రకటించారు. మంత్రి నాగార్జునను మత పెద్దలు సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దారా రవి కిరణ్మయి, వైస్ సర్పంచ్ బూర్లె రామప్రసాద్, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, పంచాయతీ వార్డు సభ్యులు షేక్ ఇస్మాయిల్, బాపట్ల జిల్లా వక్ఫ్ బోర్డు సభ్యులు సయ్యద్ నబీ, జానీ, మత పెద్దలు సయ్యద్ బాజాన్, అల్లాభక్షు, షేక్ జిలాని, వైఎస్సార్ సీపీ నాయకులు దారా చెన్నయ్య, తిరువీధుల బాలాజి, మాచర్ల వీరేంద్ర పాల్గొన్నారు. కాగా మదరస చిన్నారులతో కలసి మంత్రి నాగార్జున జగనన్న నువ్వే మా భవిష్యత్ ప్లకార్డులతో పాల్గొనడం పట్ల ముస్లింలు ఆనందం వ్యక్తం చేశారు.



భట్టిప్రోలులో ఇమామ్, మౌజన్‌లకు నూతన వస్త్రాలను అందజేస్తున్న మంత్రి నాగార్జున



బాపట్ల జమేదార్‌పేటలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లిం సోదరులు



రేపల్లెలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న, దేవినేని మల్లికార్జునరావు, ముస్లిం నేతలు

ప్రణామం... ప్రణవ పీఠం

- విద్యార్థుల్లో ఆధ్యాత్మిక పెంపుదలకు కృషి
- దేవాలయాల్లో శుభ్రత పనులు
- స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు
- ఆదర్శంగా నిలుస్తోన్న పీఠం



ఆలయాలను శుభ్రం చేస్తున్న ప్రణవపీఠం సభ్యులు

పట్నంబజారు: ప్రణవపీఠం.. పేరులో ప్రణవం - తీరులో ప్రణామం గల ఈ పీఠం ఏరుల మధ్య ఉన్న ఊరు ఏలూరు కేంద్రంగా బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ ఏర్పాటు చేసిన ఒక స్వచ్ఛంద సంస్థ.. దీన్ని ఇలా పిలవడం కంటే ఓ స్వచ్ఛమైన సంస్థ అనడమే సబబుగా ఉంటుంది. ఎందుకంటే ప్రణవం అంటేనే ఓ శక్తి పదం.. విశ్వోద్భవ ఆది ధ్వని ప్రణవనాదం.. సకల చరాచర జీవకోటి గల ఈ విశ్వంతో మనకు గల సంబంధాన్ని అర్థం చేసుకుని భ్రాంతి నుంచి విముక్తి పొందడమే ప్రణవ సారాంశం. అటువంటి నిత్య కాంతిధామమైన ప్రణవనాదంతో నామకరణం అనుసంధానం పొందిన పీఠం. కనుకనే అందులోని సభ్యులంతా స్వచ్ఛమైన మనసుతో... నిర్మలమైన హృదయంతో... నిష్కల్మషంగా ఓవైపు ఆధ్యాత్మికం మరోవైపు ఆపన్నులకు అభయ హస్తం వంటి కార్యక్రమాలు విరివిగా నిర్వహిస్తూనే ఇంకోవైపు బడి-గుడి అనే విలక్షణమైన సేవకు శ్రీకారం చుట్టారు. ఆధ్యాత్మిక చింతన ఎంతో అపూర్వం.. అదీ అందరికీ ఉండాలన్నదే.. మహానుభావుల ఆకాంక్ష.



ప్రణవ పీఠం స్థాపకుడు వద్దిపర్తి పద్మాకర్

2004లో స్థాపన..

ఏలూరు కేంద్రంగా బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ 2004 సంవత్సరంలో ప్రణవ పీఠాన్ని స్థాపించారు. సమాజంలో ఆధ్యాతిక చింతన పెంపొందించాలనే ఉద్దేశంతో పాటుపడ్డా రు. దీంతో పాటు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతూ.. ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారు. ఆధ్యాతికతను పెంపొదించటంతో పాటు.. ఆలయాల పరిరక్షణ.. పరిశుభ్ర త.. పాఠశాలల్లో విద్యార్థుల్లో పురాణాల పటిమ పెంచేందుకు పాటుపడుతున్నారు.

గుడి-బడి..

దానిలో భాగంగా 2021లో జనవరిలో గుడి-బడి అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తద్వారా ప్రతి ఆదివారం ఆలయాన్ని మెట్ల దగ్గర నుంచి ఉత్సవ విగ్రహాల వరకు శుభ్రపరిచే కార్యక్రమాన్ని చేపట్టారు. కేవలం పదుల సంఖ్యలో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో.. ఇప్పుడు వేలాది మంది అడుగులు వేస్తున్నారు. ఆలయాల పరిశుభ్రతకు పాటుపడుతున్నారు. ఇదీ కేవలం ఒక ప్రాంతానికో..ఒక ఊరికో పరిమితం కాలే దు. తెలుగు రాష్ట్రాల్లోన్ని అన్ని జిల్లాలతో పాటు, అమెరికా, సింగపూర్, మలేషి యా, యూకే, ఆస్ట్రేలియా, కెనడాతో పాటు అనేక ప్రాంతాల్లో సుమారు 6 వేల మంది బృందం ప్రతి ఆదివారం ఆలయాల పరిశుభ్రత, విద్యార్థులకు ఇతిహాసాలను తెలియజేసే పనిలో పడ్డారు. ఇందులో భాగంగా గుంటూ రు జిల్లాలో మొత్తం 250 మందితో కూడిన బృందం ఉంది. ఇప్పటి వరకు సుమారు జిల్లాలో 500పైగా ఆలయాల్లో కార్యక్రమాలు చేపట్టారు. సుమారు 200 పైగా పాఠశాలల్లో రామాయణం, భగవద్గీతల గురించి విద్యార్థులకు వివరిస్తున్నారు. వీటితో పాటు శ్రీకృష్ణాష్టమికి చిత్రలేఖనం పోటీలు, వినాయక చవితి రోజు ప్రసంగపు కార్యక్రమాలు నిర్వహించి, ఇలా పర్వదినాల్లో వివిధ కార్యక్రమాలు రూపొందించి చిన్నారుల్లో సైతం భక్తి భావాన్ని పెంపొందిస్తున్నారు. అదేవిధంగా అనేక పాఠశాలల్లో భగవంతులకు సంబంధించిన చిత్రలేఖన పోటీలు నిర్వహించారు.

సేవల్లోనూ...

ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో విశేష సేవలందించటంతో పాటు సేవా కార్యక్రమాల్లో గుడి-బడి సభ్యులు ముందుకు సాగుతున్నారు. గుంటూరు జిల్లాకు వంశీ అనే యువకుడు, కృష్ణా జిల్లాకు భాగ్యశ్రీ అనే యువతి బృందాలను సారథులుగా వ్యవహరిస్తున్నారు. దానిలో భాగంగా విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, పాఠశాలలు శుభ్రపరచటం, మంచినీటి కేంద్రాలను ఏర్పాటు చేయటంతో పాటు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు శ్రీకారం చుడుతున్నారు.

ఎవరికి వారే.. స్వచ్ఛందంగా

ఆధ్యాత్మిక చింతన, పుస్తకాల పంపిణీ, ఆలయ, పాఠశాలలను పరిశుభ్రంగా చేయటం వంటి కార్యక్రమాలకు గుడి-బడి సభ్యు లు స్వచ్ఛందంగా చేపడుతున్నారు. ఏ ఒక్కరి నుంచి రూపాయి ఆశించకుండా ఎవరికి వారే చందాలు వేసుకుని ప్రతి ఆదివారం చీపురు దగ్గర నుంచి భోజనం వరకు స్వంత ఖర్చులతో ఆ ఆలయాలు, పాఠశాలలు శుభ్రపరిచి వస్తున్నారు. ప్రత్యేక పర్వదినాలను పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇటువంటి సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకునే వారు నేరుగా రావాలని చెబుతున్నారు.

భక్తిభావం వెల్లివిరియాలి



ప్రతి ఒక్కరిలో భక్తిభావం వెల్లివిరియాలని కోరుకుంటున్నాం. మా బృందంలో ప్రతి ఒక్కరి కష్టం ద్వారానే ఇప్పటి వరకు అనేక సేవా కార్యక్రమాలు, ఆలయాల పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాం. మా బృందంలో ఎంతో మంది ప్రభుత్వోద్యోగులు, యువత, విద్యార్థులు, పెద్దలు ఉన్నారు. వారు అందిస్తున్న సహకారం, సాయం మరువలేనిది. ఈ కార్యక్రమాల్లో పాల్గొనదలచిని వారు 9966222934 నెంబరును సంప్రదించగలరని మనవి.

– వంశీ, గుంటూరు గుడి-బడి బృందం సారథి

సేవ చేయటంలో సంతృప్తి



ఎటువంటి స్వార్థం లేకుండా బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గురువు చెప్పిన సేవా కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ఎంతో సంతృప్తి కలుగుతోంది. మన జీవతంలో కనీసం వారంలో ఒక రోజైనా భగవంతుడు, పేదల కోసం వినియోగించి కష్టపడి పని చేయాలి. తద్వారా భగవంతుడి ఆశీస్సులు అందటంతో పాటు, పేదలకు మంచి చేయగలుగుతాం. కృష్ణాజిల్లాలో ఏదైనా ఆలయం, ప్రభుత్వ పాఠశాలలు బాగు చేసే కార్యక్రమాలు ఉంటే 9010209190 నెంబరును సంప్రదించాలని విజ్ఞప్తి.

– భాగ్యశ్రీ, గుడి-బడి కృష్ణాజిల్లా అడ్మిన్

నిత్యాన్నదానానికి విరాళాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసిన దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి పలువురు భక్తులు శనివారం విరాళాలు సమర్పించారు. రాజమండ్రి కోదండ రామాలయం ప్రాంతానికి చెందిన చలుమూరు వెంకట మహేష్ కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబును కలిసి నిత్యాన్నదానానికి రూ.1.08 లక్షల విరాళాన్ని అందజేశారు. విజయవాడ ఇస్లాంపేటకు చెందిన ఇట్లా అశోక్‌కుమార్, రమ్యశృతి నిత్యాన్నదానానికి రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు.

క్లుప్తంగా

చెరువులో పడి మహిళ మృతి

యద్దనపూడి: ఉపాధి పనులకు వెళ్తుండగా మార్గంమధ్యలో ఫిట్స్ రావటంతో ఓ మహిళ చెరువులో పడి మృతి చెందింది. ఈ ఘటన యద్దనపూడిలో శనివారం ఉదయం జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. యద్దనపూడి గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన పోలూరి కోటమ్మ (60) శనివారం ఉదయం ఉపాధి పనికి వెళ్తుండగా ఒక్కసారిగా ఫిట్స్ వచ్చాయి. ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ పక్కనే ఉన్న చెరువులోకి దొర్లుకుంటూ పడిపోయింది. అదే దారిలో పనులకు వెళ్తున్న కూలీలు చెరువులో పడి ఉన్న కోటమ్మను గమనించి ఒడ్డుకు చేర్చారు. అప్పటికే ఆమె మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఉపాధి ఏపీవో రమేష్‌బాబు ఘటనాస్థలికి వెళ్లి పోలీసులకు, ఉన్నతాధికారులకు తెలియజేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు.

జూదరుల అరెస్టు

వేటపాలెం: మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామ శివారులో పేకాట శిబిరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న పది మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై జీ సురేష్ శనివారం తెలిపారు. వీరి వద్ద నుంచి రూ. 24,300 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. జూదం ఆడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

ఘనంగా వైష్ణవాలయ వార్షికోత్సవం



హరిద్రాలంకణలో అమ్మవారు

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడు నడిబొడ్డున రెండు తాగునీటి చెరువుల మధ్యన కొలువైన వైష్ణవీ దుర్గాలయం 22వ వార్షికోత్సవాలు శనివారం కన్నుల పండువగా ప్రారంభమయ్యాయి. స్థానిక వైష్ణవాలయంలో ఉదయం నుంచి ఆలయ ధర్మకర్తలు, ఆలయ ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని శనివారం హరిద్రాలంకరణలో భక్తుల దర్శనానికి ఉంచారు. ఆలయ భక్త మండలి ఆధ్వర్యంలో లలితా పారాయణం నిర్వహించారు. భక్తుల గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్



10వ వార్డులో లబ్ధిపత్రాలను అందిస్తున్న వెంకటేష్

చీరాల: అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని చీరాల వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. శనివారం చీరాల పట్టణంలోని 10వ వార్డులోని థామస్‌పేట సచివాలయ పరిధిలో కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వెంకటేష్ గడప గడపకు వెళ్లి కుటుంబ సభ్యులను పలకరించి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అలానే వార్డులోని లబ్ధిదారులతో మాట్లాడారు. అర్హత ఉండి సాంకేతిక కారణాలతో పథకాలు అందకపోయిన వారు ఆయా సచివాలయాల పరిధిలోని వలంటీర్ల సాయంతో సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ప్రతిఒక్కరూ ఆదరించి బలపరచాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ జైసన్‌బాబు, 10 వార్డు కౌన్సిలర్ గోలి స్వాతిరవి, మున్సిపల్ కౌన్సిలర్లు తోకల అనీల్, కంపా అరుణ్, కౌన్సిలర్లు కీర్తి వెంకట్రావు, మించాల సాంబశివరావు, కె.యానాదిరావు, బత్తుల అనిల్, గుంటూరు ప్రభాకర్, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నట దిగ్గజం బండారు రామారావు



మాట్లాడుతున్న రంగస్థల నటుడు శ్రీనివాసరావు

అద్దంకి: నట దిగ్గజం బండారు రామారావు అని రంగస్థల నటుడు ఆలకుంట శ్రీనివాసరావు అన్నారు. స్థానిక కేర్ అండ్ క్యూర్ హోమియో వైద్యశాల ఆవరణలో శనివారం రాత్రి 'ప్రతిభామూర్తులు' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని దొప్పలపూడి హనుమంతరావు జ్ఞాపకార్థం జాషువా కళా సమితి అధ్యక్షుడు పీసీహెచ్ కోటయ్య అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా బండారు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నట చూడామణి అద్దంకి నాటకరంగ రత్నం బండారు రామారావు గురించి శ్రీనివాసరావు వివరించారు. త్రిపురనేని గోపీచంద్ రచించిన 'అసమర్థుని జీవయాత్ర' పుస్తకాన్ని సాహితీ స్రవంతి సాహిత్య సంఘ చందలూరి నారాయణరావు సమీక్షించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ పట్టణానికి నాటక రంగంలో దేశ విదేశాల్లో సత్యహరిశ్చంద్ర పరంగా ఖ్యాతి తెచ్చారని చెప్పారు. ఆనాటి నుంచి నేటి వరకు పట్టణం నటులకు నిలయంగా మారిందని, వారి వారసులు సైతం నాటక రంగంలో ఉన్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు గాడేపల్లి దివాకరదత్తు, జ్యోతి చంద్రమౌళి, రిటైర్డ్ ఆర్జేడీ యూ దేవపాలన, ఆర్‌వీ రాఘవరావు, మోటుపల్లి రామదాసు, చప్పిడి వీరయ్య, నర్రా శ్రీలక్ష్మి, కొల్లా భువనేశ్వరి, సాహితీ సంఘాల సభ్యులు, అసోసియేషన్ సెక్రటరీ ఎం హనుమంతరావు, సభ్యులు యూవీ బ్రహ్మం, ఎస్‌కే ఖాశీం, టీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వలంటీర్‌కు అమృతపాణి భరోసా



వలంటీర్‌తో మాట్లాడుతున్న అమృతపాణి

చీరాల రూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న వలంటీర్‌కు వైఎస్సార్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వరికూటి అమృతపాణి అండగా నిలిచారు. ఈపురుపాలేనికి చెందిన వలంటీర్ దేవరపల్లి సంతోష్ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఇప్పటికే రెండు లక్షలకుపైగా ఖర్చుచేశారు. సమాచారం అందుకున్న అమృతపాణి తన సహచరులతో వలంటీర్ సంతోష్ ఇంటికి స్వయంగా వెళ్లి పరామర్శించారు. ఎంత ఖర్చయినా వైద్య సేవలు అందిస్తామని, భయపడాల్సిన పనిలేదని సంతోష్‌కు ధైర్యం కల్పించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ దామర్ల శ్రీకృష్ణ, డాక్టర్ తాడివలస దేవరాజు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు షేక్ హుమయూన్ కబీర్, సంగుల జాన్ చిరంజీవి, గోసాల అశోక్, గుమ్మడి చిన్నబాబు, దేవరపల్లి నరేష్, తదితరులు ఉన్నారు.


30 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్‌లు

ఇంకొల్లు(చినగంజాం): మండలంలోని దుద్దుకూరు గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ రాయిని సుబ్బరామయ్య కంటి సమస్యలతో బాధపడుతున్న 30 మందికి కంటి ఆపరేషన్‌లు ఉచితంగా చేయించి తన దాతృత్వాన్ని చాటుకున్నాడు. కంటి సమస్యలతో బాధపడుతున్న 30 మంది పేద ప్రజలను ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ ద్వారా గుర్తించి వారిని హాస్పిటల్ నందు చేర్చి వారికి మంచి నాణ్యమైన చికిత్సతో కంటి శుక్లాలు, కంటి పొరలు ఆపరేషన్‌లు చేయించి వారికి కళ్లజోళ్లు ఇప్పించి తన గొప్పతనాన్ని చాటుకున్నాడు. కార్యక్రమంలో హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ రఫీ, గ్రామ పెద్ద చెన్నుపాటి జనార్దనరావులు వారికి సహాయ సహకారాలు అందించారు.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం

బల్లికురవ: పాస్టర్లందరికీ నెలనెల రూ. 5 వేలు గౌరవవేతనం అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మండల పాస్టర్ల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు తంగిరాల తిమోతి, మేదర అంజయ్య కృతజ్ఞతలు తెలిపారు. శనివారం కొత్త మల్లాయపాలెం, గ్రామంలోని చర్చిలో మండల పాస్టర్ల సంఘ సమావేశం జరిగింది. మండలంలో 20 మందికి వేతనాలు అందుతున్నాయని, వేతనాలు పొందాల్సిన వారు చర్చి స్థలం రిజిస్ట్రేషన్, పాస్టర్ బైబిల్ సర్టిఫికెట్‌తో దరఖాస్తు చేసుకుంటే గౌరవ వేతనం పొందవచ్చని తిమోతి వివరించారు. గొర్రెపాటి వీరేషు, నాగుబాబు ముసలయ్య, సుంకర వీరభద్రావు, ఎస్. రాంబాబు, కె పౌలు పాల్గొని మాట్లాడారు.

రేంజ్ ఐజీని కలిసిన చైతన్య, గరటయ్య



ఐజీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కృష్ణచైతన్య



ఐజీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గరటయ్య

అద్దంకి: గుంటూరు రేంజ్ ఐజీ పాల్‌రాజును రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య, మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచు గరటయ్య శనివారం గుంటూరులో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

బాధితులకు ఆర్థిక సహాయం



బాధితులకు సాయం అందిస్తున్న శాప్‌నెట్ చైర్మన్ కృష్ణచైతన్య

జే.పంగులూరు: విద్యుదాఘాతంతో కోటపాడు గ్రామంలో ఇళ్లు కాలిపోయిన బాధితులకు ఏపీ శాప్ నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ బాచిన కృష్ణచైతన్య శనివారం పరామర్శించారు. వారి ఇళ్ల నిర్మాణానికి అండగా ఉంటామని, తక్షణ సాయంగా రూ. 1 లక్ష నగదును బాధితులకు అందించారు. అద్దంకి రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బాధితులకు ఇంటి సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ ఎంసీ సభ్యులు బీవీ కృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు యర్రం శ్రీనివాసరెడ్డి, ఏజీపీ యర్రమోతు రమేష్, మాజీ సర్పంచ్ వైఎస్సార్ సీపీ నాయకులు గోపాల్‌రెడ్డి గ్రామ నాయకులు బాధితులు ఉన్నారు.

ఈపురుపాలెంలో 'మా భవిష్యత్ నువ్వే జగన్'



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

చీరాల టౌన్: రాష్ట్ర ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యం అని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఈపురుపాలెం గ్రామ పంచాయితీలో ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ ఆదేశాలతో సచివాలయ కన్వీనర్ బిట్రా శ్రీను ఆధ్వర్యంలో 'మా భవిష్యత్తు నువ్వే జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ హయాంలో ఒక్కో ఇంటికి జరిగిన మేలు, సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సుభానీ, గవాస్కర్, లోకనాథం, వలంటీర్లు, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.